ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

జిల్లా వార్తలు

ఆదివారం 6 ఏప్రిల్ 2025

యువతకు స్ఫూర్తి బాబు జగ్జీవన్ రామ్



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ మంచిర్యాల చౌరస్తాలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చదువు ద్వారానే జగ్జీవన్‌రామ్ అంతటి కీర్తి సంపాదించారని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ కార్మిక మంత్రిగా కీలక చట్టాలను అమలు చేశారన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వ్యవసాయ, నీటిపారుదల, రక్షణ, రైల్వే శాఖ మంత్రిగా బాబు జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివని అన్నారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ ఆయన జన్మించిన రాష్ట్రంలోనే తాను జన్మించానని, ఆయన గొప్పతనం గురించి చిన్ననాటి నుంచే తనకు తెలుసునని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవతార పురుషులని కొనియాడారు. అనంతరం ఈనెల 14న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

● చెక్కుల పంపిణీ...

కులాంతర వివాహం చేసుకున్న ఐదుగురు దంపతులకు వివాహ ప్రోత్సాహక బహుమతి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బోయినిపల్లి చంద్రయ్య, మేడి అంజయ్య, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఎస్సీ అభివృద్ధి అధికారి పవన్ కుమార్, వైద్యుల అంజన్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లయ్య, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇనచార్జి పురుమల్ల శ్రీనివాస్, గజ్జల ఆనందరావు, శ్యామ్, తీట్ల ఈశ్వరి, మేడి మహేశ్, మామిడిపెల్లి బాపయ్య, బొత్త వెంకటమల్లయ్య, కోండ్ర స్వరూప, కల్లెపల్లి శంకర్, కొమ్ము రమేశ్, గంటల రేణుక, బండ శకుంతల, బోగె పద్మ, శుక్రుద్దీన్, గోష్కి అజయ్, గసికంటి కుమార్ పాల్గొన్నారు.

- నెలాఖరు వరకు 25 శాతం రాయితీ
- గడువు పొడిగింపుతో ఆదాయం రెట్టింపయ్యే అవకాశం
- మందకొడిగా ప్రొసీడింగ్స్ జారీ



'ఎల్ఆర్ఎస్'తో రూ.37.87కోట్ల ఆదాయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)తో ప్రభుత్వానికి జిల్లాలో 37.87 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. జిల్లావ్యాప్తంగా ఎల్ఆర్ ఎస్ కోరుతూ వచ్చిన దరఖాస్తుల్లో 21 శాతం మంది మాత్రమే డబ్బులు చెల్లించారు. 80 శాతం మంది దరఖాస్తులు చేసుకు న్నవారు తమ భూమి క్రమబద్ధీకరణ కోసం డబ్బులు చెల్లించలేదు. దర ఖాస్తులు చేసుకోని వారు వేల సంఖ్యలో ఉన్నారు. వివిధ కారణాలతో ఎల్ఆర్ఎస్ చెల్లింపులు, ప్రొసీడింగ్స్ జారీ ఆలస్యం అవుతుం డడం ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరువరకు ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు గడువు పెంచడంతో ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశముంటుందని భావిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారంతా ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లిస్తే మరో 140 కోట్ల ఆదాయం జిల్లా నుంచి ప్రభుత్వానికి సమకూరనున్నది. 2020లోపు స్థలాలను, ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకొని వెయ్యి రూపాయల నామినల్ చార్జీలతో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గత ప్రభుత్వం పలుమార్లు చార్జీలు చెల్లించడంతోపాటు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి రెగ్యులరైజ్ చేసుకోవాలంటూ అవకాశమిచ్చింది. దరఖాస్తుదారులు పెద్దగా ఆసక్తి చూపించలేదు.

● ఎఆర్ఎస్ లేకుంటే అనుమతులు ఇవ్వబోమని హెచ్చరిక

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవడంతోపాటు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను క్లియర్ చేయాలని నిర్ణయించి ఎల్ఆర్ఎస్ చార్జీల్లో 25 శాతం రాయితీని ప్రకటించింది. మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని, ఎల్ఆర్ఎస్‌కు ఇదే చివరి అవకాశ మంటూ విస్తృత ప్రచారం చేసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయమని, ఇళ్ల నిర్మించుకుంటే అనుమతి ఇవ్వబో మంటూ హెచ్చరించింది. దీంతో అర్జీదారుల్లో కదలిక వచ్చి చార్జీలను చెల్లిస్తారని భావించింది. 25 శాతం రాయితీతో అర్జీదారులు చాలా మంది ముందుకు వ చ్చారు. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు సుడా పరిధిలోని అర్బన్ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ ద్వారా స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు సిద్ధమ య్యారు. ప్రభుత్వం ఎల్-1, ఎల్-2, ఎల్-3 మూడు స్టేజీల్లో అర్జీలను పరిశీలించిన తర్వాత చార్జీలను నిర్ధారించి తీసుకుంటామని చెప్పింది. అర్జీదారులు మరోసారి డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.

మున్సిపాలిటీల వారీగా ఎల్ఆర్ఎస్ వివరాలు

మున్సిపాలిటీ/ కార్పొరేషన్	వచ్చిన దరఖాస్తులు	అర్హత ఉన్నవి	ఫీజులు చెల్లించినవి	చెల్లించిన మొత్తం	జారీ చేసిన ప్రొసీడింగ్స్
కరీంనగర్	29,537	17,535	4,315	23 కోట్లు	1,785
చొప్పదండి	1,447	938	128	42 లక్షలు	43
హుజూరాబాద్	3,990	2,853	556	1.72 కోట్లు	189
జమ్మికుంట	5,914	4,525	1,120	3.08 కోట్లు	440
సుడా పరిధిలో..	21,236	16,362	3,067	9.65 కోట్లు	-----

● సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం, చాలా మంది దరఖాస్తులను ఎల్-1, ఎల్-2 స్టేజీల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్-1 రెవెన్యూ, ఎల్-2 రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ) తీసుకురావాలంటూ నిబంధన విధించడంతో ఆయా కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అక్కడ కూడా సైట్ ఓపెన్ కాక పోవడం వంటి సాంకేతిక సమస్యలతో మార్చి 31 వరకు చాలా మందికి ఎన్‌వోసీలు రాలేదు. కొంత మందికి ఎన్‌వోసీ జారీ చేసినా తప్పులు దొర్లడంతో ఎల్ఆర్ఎస్ చార్జీలు చెల్లించేందుకు సముఖంగా ఉన్నప్పటికీ ఎన్‌వోసీ లేకపోవడంతో చెల్లించే అవకాశం లేకుండా పోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలు తలెత్తడంతో ఎల్ఆర్ఎస్ చార్జీలపై 25శాతం రాయితీ కల్పించినా ఆశించిన మేరకు దరఖాస్తులు క్లియర్ కాలేదు. ప్రభుత్వానికి ఆదాయం అంచనా మేరకు రాలేదు.

● చార్జీలు చెల్లించినా పెండింగ్‌లోనే..

కరీంనగర్ నగరపాలక సంస్థలో 2020 వరకు ఎల్ఆర్ఎస్ కోసం 29,537 మంది చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో కోర్టు కేసులు, ప్రభుత్వ స్థలాలు, ఇతరత్రా కారణాలతో 17,535 మంది దర ఖాస్తులు మాత్రమే ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉన్నవని పేర్కొంటూ వారికి 25శాతం రాయితీ వర్తిస్తుందని వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1 వరకు 4,315 మంది మాత్రమే డాక్యుమెంట్లను సమర్పించి ఎల్ఆర్ఎస్ చార్జీ లను రాయితీపోగా మిగి లిన వాటిని చెల్లించడంతో 23 కోట్ల ఆదాయం ప్రభు

(మిగతా 8వ పేజీలో)

'కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరించాలి'

భగత్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరుతూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ధర్మ ప్రచారంతోపాటు, హిందూ ఆలయాల నిర్మాణ అభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని అనేక ఆలయాలను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. 2023లో కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. అదే ఏడాది మే 31న కరీంనగర్‌లో పది ఎకరాల స్థలంలో భూమి కేటాయిం చిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, ఆలయ నిర్మాణం కోసం జిల్లాతోపాటు, పొరుగు జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగించేలా చ్యలు తీసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 30 వరకు పొడిగించామని సీపీ గౌస్ ఆలం శనివారం ఒక ప్రక ప్రకటనలో తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. డీజే సౌండ్ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 30 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని సీపీ తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు మైక్‌సెట్ వినియోగం తప్పనిసరైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి పొందాలని సూచించారు.

భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్టుల వినియోగాన్ని 30వ తేదీ వరకు నిషేధించామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ అన్నారు. సంబంధిత ఏసీపీల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించవద్దన్నారు. ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించవద్దన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 31వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై ఐపీసీ సెక్షన్ 188 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు శ్రీరామనవమి





ఇల్లందకుంటలో ముస్తాబైన ఆలయం, ఏర్పాటు చేసిన షామియానాలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజ విలువలు, ధర్మాలు, ఉన్నత జీవన విధానాన్ని లోకానికి అందించిన శ్రీరాముడు జన్మించిన నవమి నాడే కల్యాణాన్ని జరపడం సంప్రదాయంగా వస్తున్నది. చైత్రశుద్ధ పాడ్యమి, ఉగాది నుంచి నవమి వరకు వసంతరాత్రులు జరిపి కల్యాణాన్ని నిర్వహిస్తారు. కరీంనగర్‌లోని ఆలయాల నిర్వాహకులు, అధికారులు, మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్ళు, నీటి వసతి, ప్రత్యేక వేదికలు, అన్నదానం వంటి ఏర్పాటు చేయగా ఆలయాలను విద్యుద్దీపాలు, షామియానాలు, పుష్పమాలలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు అలంకారాలు చేసి ఎదుర్కోలు వేడుకను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కల్యాణాలు వైభవోపేతంగా జరగనున్నాయి. ఎండవేడిమి దృష్ట్యా మంచినీటి సౌకర్యం, మజ్జిగ వితరణ, అన్నదానాలు, పెండాల్స్ ఏర్పాటు చేశారు.

● ఇల్లందకుంటలో ఏర్పాట్లు పూర్తి

ఇల్లందకుంట: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించేందుకు ఆలయ ఈవో కందుల సుధాకర్, ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంల్లో ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపాన్ని అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతోపాటు, ఆలయంలో షామియానాలు, చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటి, వైద్య సదుపాయంతో పాటు, బస్ సౌకర్యం, కల్యాణాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. జమ్మికుంట రా రైస్, పారాబాయిల్డ్, కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం నిత్యవిధి అనంతరం సాయంత్రం విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన బందోబస్తును సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

● ఆలయాల్లో ఏర్పాట్లు





ముస్తాబైన ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం



మహాశక్తి ఆలయంలో ఏర్పాట్లు

నత్తనడకన డబుల్ రోడ్డు పనులు

- కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గునుకుల కొండాపూర్ నుంచి జంగపల్లి వరకు వేసిన కంకర రోడ్డు

గన్నేరువరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి స్టేజి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు మంజూరైన 21 కిలోమీటర్ల డబుల్‌రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు గుండపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు మాత్రమే డబుల్ రోడ్డు పూర్తయింది. అక్కడి నుంచి జంగపల్లి వరకు రోడ్డు వెడల్పు చేసి కంకరవేసి వదిలేశారు. దీంతో వాహనదారులు కంకర రోడ్డుపై ప్రయాణించడానికి జంకుతున్నారు. కంకరతో వాహనాల టైర్లు పాడవుతున్నాయని, అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జంగ పల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల ప్రజలు రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని నిరసనలు చేపట్టారు. నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు ముందుకు సాగకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకొని నిలిచిన డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈఈ సురేష్‌ను వివరణ కోరగా నిధుల లేమితో డబుల్‌రోడ్డు పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టరుకు నిధులను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. త్వరగా డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టరుకు సూచించామన్నారు.

అందని బిల్లులు... ఆగిన పనులు

- ఏళ్లుగా ముందుకు సాగని నిర్మాణ పనులు

6

సేంద్రియ సాగు శిక్షణకు ఇటిక్యాల రైతు



శాస్త్రవేత్తతో రైతు రాజేందర్‌రెడ్డి

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న సేంద్రియ సాగు శిక్షణకు రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికిచెందిన రైతు గడ్డం రాజేందర్ రెడ్డిని ఎంపిక చేయగా మౌంట్ అబులో శిక్షణ పొందుతున్నాడు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ సాగులో మెళకువలు నేర్పిస్తున్నారని తెలిపాడు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

అందని బిల్లులు...ఆగిన పనులు

- ఏళ్లుగా ముందుకు సాగని నిర్మాణ పనులు

గంగాధర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు అధికారుల నిర్వక్షంగా ఏళ్లుగా ముందుకు సాగడంలేదు. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు వదిలేయడంతో అసంపూర్తిగా ఉన్న భవనాలు దర్శనమిస్తున్నాయి. గంగాధర మండలంలోని లక్ష్మీదేవి పల్లిలో పాఠశాల భవనానికి గత ప్రభుత్వం మూడు లక్షల రూపా యలు మంజూరు చేసింది. స్లాబు పూర్తి చేసి లోపల ఒక వైపు గో డలు, ఫ్లోరింగ్ పనులు పూర్త య్యాయి. 2.65 లక్షల బిల్లు మంజూరైంది. మిగతా బిల్లులు రాకపోవ డంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. ప్రహరీ, లోపల గోడలు నిర్మించాలి. మిగులు పనులకు 2.25 లక్షలు మంజూరైనట్లు సమాచారం. పాఠశాల పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుండైనా వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



లక్ష్మీదేవిపల్లిలో పాఠశాల భవనం

- అద్దె భవనంలో పల్లె దవాఖాన

మండలంలోని కురిక్యాల పల్లె దవాఖాన అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. సొంతభవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం 21 లక్షల నిధులు మంజూరయ్యాయి. స్లాబు వేసిన కాంట్రాక్టర్ బిల్లులు రాక మధ్యలో వదిలేశాడు.



కురిక్యాలలో అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవనం

- ఇదే గ్రామంలోని పాఠశాలకు మన ఊరు మనబడి పథకం కింద 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయి.ది. ఈ నిధులతో కిచెన్ షెడ్డు, టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయించారు. నిధులు సరిపోక కిచెన్‌కు పిల్లర్లు వేసి వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు నిధులు విడుదల చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నంబర్‌ప్లేట్ లేని 14 బైక్‌లు సీజ్



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై రవి

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, మైనర్‌డ్రైవింగ్‌పై పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్‌ప్లేట్ లేని 14ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించి సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



సంపత్ కుమార్

జమ్మికుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని పాత వ్యవసాయ మార్కెట్ ప్రాంతానికిచెందిన భూపతి సంపత్ కుమార్ కనపడటం లేదని అతడి భార్య హేమ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపినవివరాల ప్రకారం.. సంపత్ కుమార్ పదిసంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. తరుచూ ఇంట్లో ఆర్థిక పరిస్థితి చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈనెల 5న ఉదయం 10.30గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఫలితం లేకుండా పోయింది. ఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ రావడంతో సంపత్‌కుమార్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన రాగుల శ్రీనివాసచారి కరీంనగర్ నుంచి తాడికల్ వస్తున్నాడు. తాడికల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుల వద్ద ఒడిస్సాకు చెందిన డీబీఎల్ కంపెనీలో పనిచేసే కృష్ణ ఎదురెదురుగా రావడంతో రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాసచారికి, కృష్ణకు గాయాలు కావడంతో స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలి



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి ఫొటోను సీసీ ఫుటేజీ ఆధారంగా శనివారం టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ విడుదల చేశారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం మేరకు మృతిచెందిన వ్యక్తి రాకేష్ అయి ఉంటాడని భావిస్తున్నామని హుజూరాబాద్ ప్రాంతానికి ఎందుకు వచ్చాడో తెలియడం లేదన్నారు. ఫొటోలో ఉన్న వ్యక్తిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సమాజంలో న్యాయవాద వృత్తి మహోన్నతమైనది



మానవ హక్కుల కమిషన్ మాజీచైర్మన్ జస్టిస్ చంద్రయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్జి దుర్గేష్

సుల్తానాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంతో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు పరిష్కారాన్ని చూపించే న్యాయవాద వృత్తి మహోన్నతమైనదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. శనివారం సుల్తానాబాద్ కోర్టును సందర్శించిన ఆయన బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను సమాజంలో అమలుపరచని సందర్భాలలో వాటిని సవ్యమైన మార్గంలో నడిపించేందుకు న్యాయవాదులు సేవ చేయాలని అన్నారు. న్యాయవాదులకు చట్టాలు, రాజ్యాంగ హక్కులు పట్ల అవగాహన కల్పించారు. కాగా జస్టిస్ చంద్రయ్యకు సుల్తానాబాద్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సన్మానించారు. బార్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి,న్యాయవాదులు కలిసి జస్టిస్ చంద్రయ్య ను ఘనంగా సన్మానించారు. బార్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజంయాదవ్, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, బాలకిషన్ ప్రసాద్,మాదూరి అంజనేయులు, జోగుల రమేష్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేష్, బిబ్బిలి శ్యామ్, కరుణాకర్, లెక్కల గంగాదర్, తిరుపతి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ధర్మపురి పోలీసులు శనివారం కనుగొన్నారు. నదిలోగల బండరాళ్ల కింద మృతదేహం కుళ్లిపోయి ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని టీఆర్ నగర్ కాలనీకి చెందిన షేక్‌నజీర్ అనేవ్యక్తి నుంచి 131గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల మండలం ధరూర్‌శివారులో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా నజీర్ అనే వ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నజీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మానవాళికి శ్రీరాముడి జీవితం ఆదర్శం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శమని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్ముల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్ గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో శనివారం కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామోత్సవంలో ఆయన ప్రసంగించారు. యువత సన్మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలన్నారు. నేటి యువతరం శ్రీరామ రాజ్యాన్ని నిర్మించాలని నాదేశం-నాధర్మం అనే నినాదంతో యువతీ యువకులు ముందుకు సాగాలన్నారు. సమాజంలో మాతృమూర్తుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, గోరక్ష ప్రముఖ్ ఇసంపెల్లి వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, ములుకుంట్ల శ్రీనివాస్, పిన్నింటి శ్రీనివాస్, పారిపల్లి చక్రపాణి, అరవింద్, కోట తిరుమల, సూర్యదేవర జ్యోతి, లలితమ్మ, స్వప్న, మమత, స్వరూప, పాల్గొన్నారు.

వంగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొంకూరు గ్రామంలో విద్యుత్‌స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. పలు వీధుల్లో విద్యుత్‌స్తంభాలు పూర్తిగా ఇళ్లపైకి ఒరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు వస్తే ఇంటిపై స్తంభంకూలితే భారీప్రమాదం చోటు చేసుకుం టుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని ఇళ్లపై ఒరిగిన విద్యుత్‌స్తంభాలను సరిచేసి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పెద్దబొంకూరులో ఇళ్లపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఆము దాలపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్య దర్శి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ విధులు ముగించుకొని స్వగ్రామమైన జమ్మికుంటకు ద్విచక్ర వాహ నంపై వెళ్తున్నాడు. ఆముదాలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై పడి పోయి ఉండగా, అటుగా వెళ్తున్న రైతులు గమనించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి 108కుసమాచారం అందించారు. చికిత్సనిమిత్తం 108లో ఆస్పత్రికి తరలిం చారు. కాగా ఈప్రమాదానికి సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

స్వాతంత్ర్య సమరయోధుడు కాంతారావుకు కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ సాయుధపోరాటవీరుడు(సీపీఐ) సుల్తాన్‌పూర్ మాజీసర్పంచ్ తానిపర్తి కాంతారావుకు ప్రజలు, నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం ఆయన మృతిచెందగా శనివారం సుల్తాన్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులు, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా జరిగినఉద్యమంలో చురుకుగా పాల్గొన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గాపనిచేసి ప్రజలకు విశేషసేవలు అందించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్‌డీవో గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐశేఖర్‌లు కాంతారావు పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శులు తాండ్రసదానందం, మర్రివెంకటస్వామి అంత్యక్రియల్లో పాల్గొని ఎర్ర జెండాను కప్పారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడెమోశారు. మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

- నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

మహాముత్తారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పడంతో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదవరిఖనికి చెందిన బోగిరి విజయ్‌కుమార్, ఎం అశోక్, శేఖర్, రాంరెడ్డి మహాముత్తారం మండలం మీదుగా ములుగు జిల్లా మేడారం వెళ్తుండగా యామన్‌పల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ధ్వంసమై నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరు స్వల్పంగానూ, ముగ్గురు తీవ్రంగానూ గాయపడినట్టు తెలిసింది. క్షతగాత్రులను 108 సిబ్బంది భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర కుమార్ తెలిపారు.

మట్టి కుండ పోయి ప్లాస్టిక్ బిందె వచ్చె!



ఈత చెట్లకు కట్టిన ప్లాస్టిక్ బిందెలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీసి నిల్వ చేయడం కోసం గతంలో గీత కార్మికులు లొట్టిలు(కుండలు) వినియోగించేవారు. కులవృత్తులకు ఆదరణ తగ్గడంతో కుమ్మరులు కుండలు చేయడం మానేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కుండలు అందుబాటులో లభించకపోవడం, కోతుల బెడద అధికమవడంతో ఈత చెట్ల నుంచి కల్లు తీసేందుకు గీత కార్మికులు లొట్టిల(కుండలు)కు బదులు ప్లాస్టిక్ బిందెలను వాడుతున్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఈత చెట్లకు ఇలా ప్లాస్టిక్ బిందెలను కట్టి కల్లును సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ బిందెలు వాడడం వల్ల కోతులు అటు ఇటు తీసేసిన కింద పడి పగిలిపోకుండా ఉంటుందని గీత కార్మికులు పేర్కొంటున్నారు.

ప్రజా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న హైద్రాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాదర్నా పోస్టర్లను శనివారం యైటింక్లయిన్‌కాలనీ, రామగిరి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ ఐఎఫ్‌టీయూ ఆఫీస్‌లలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి బీ అశోక్ మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండను సృష్టిస్తున్నాయన్నారు. వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరిట బలి తీసుకుంటున్నారని, అడవుల్లోని అపార ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే కగార్ పేరిట హత్యాకాండ సాగిస్తున్నాయని అశోక్ పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థి యువజన సంఘాలు కేంద్ర వైఖరిని ఖండించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ప్రజాదర్బార్‌కు కార్మికులు, ప్రజలు తరలిరావాలని అశోక్ పిలుపునిచ్చారు.

మధ్య మానేరు నిర్వాసితులను.. గుండెల్లో పెట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రవరంలో ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు నిర్వాసితులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, అనుపురం, చింతలఠాణ, చీర్లవంచ, కొడుముంజ, శాభాష్‌పల్లి, గుర్రంవానిపల్లి గ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పథకాన్ని రుద్రవరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ మండలంలోని నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూశానని, వారిత్యాగం మరువలేనిదన్నారు. నిర్వాసితులకు ఉపాధికల్పనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని గుర్తుచేశారు. 9గ్రామాల్లో 3500 మంది ఉపాధిహామీ నిర్వాసిత కూలీలకు 100 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. ఒక్క రోజు పనికి రూ.300పైచిలుకు చెల్లిస్తున్నామని, జాబ్‌కార్డు లేని వారికి జాబ్ కార్డులు అందించి పని కల్పిస్తామన్నారు. ఉపాధిహామీ పనికి వెళ్లడం ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికికూడా అర్హులు అవుతారని సూచించారు. ప్రజలందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుద్రవరం గ్రామానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైసింగ్ తెలంగాణగా ముందుకుపోతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో మల్హోత్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ఎర్రం రాజు, గాలిపెల్లి స్వామి ఉన్నారు.

ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు



మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానవతా వికాసకేంద్రాలుగా విలసిల్లుతున్నాయని, ప్రజలకు సేవలందించే విధంగా మనపూర్వీకులు ఆలయాలను రూపొందించారని జాతీయ సాహిత్యపరిషత్ పూర్వ జాతీయఅధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జాతీయ సాహిత్యపరిషత్ కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లి చిన్నగుట్టపై స్వయంభూ వేంకటేశ్వరాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడారు. దేవాలయాలు ఆధ్యాత్మికతతోపాటు అన్న సత్రాలుగా, అనాథాశ్రమాలుగా, ధర్మ సత్రాలుగా, విద్యా, వైద్య, వేద, కళా, సాంస్కృతిక కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయన్నారు. పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ లెక్కల రాజభాస్కర రెడ్డి, పరిషత్‌తెలంగాణ అధ్యక్షుడు వడ్డూరి ఆంజనేయరాజు, నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ వాసాల రమేశ్, సంస్థ ప్రధానకార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న రచయిత్రులు

నేడే రామయ్య కల్యాణమహోత్సవం

- హాజరుకానున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న సన్నిధిలో రామయ్య దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించేందుకు ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వేములవాడకు తరలిరానున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీస్వామివారి కల్యాణతంతు నిర్వహించనున్నారు. సాయంత్ర 5 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు డోలోత్సవము ఘనంగా నిర్వహించనున్నారు. రాజన్న ఆలయానికి సుమారుగా 50 వేల వరకు భక్తులు తరలి రానున్నారని, దానికి అనుగుణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలె త్తకుండా ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ వీరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాజన్న ఆలయంలోని ఈవో కార్యాలయం ముందు ప్రత్యేక కల్యాణ మండపం పైన శ్రీస్వామి వారి కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బారీకేడ్స్‌తో గ్యాలరీలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణ మహోత్సవానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.


కల్యాణానికి ఏర్పాటు చేసిన బారికేడ్లు


కల్యాణవేదిక ఏర్పాట్లు

● భక్తులు ఇబ్బందులు లేకుండా చర్యలు..

శ్రీసీతారాముల కల్యాణాన్ని వేములవాడ రాజన్న ఆలయంలో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, భక్తులను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు ఉచిత భోజన వసతిని, వేసవి కాలం కావడంతో చల్లని తాగునీరు. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ధర్మపురి నుంచి పట్టువస్త్రాలు.. తలంబ్రాలు


ధర్మపురి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ఆలయ ఈవో, ధర్మకర్తలు

ఇల్లందకుంట/ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ పట్టువస్త్రాలు.. ముత్యాల తలంబ్రాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈఏడాది కూడా స్వామివారి కల్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశామన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఈవో, ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపిక

హుజూరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన మోటపోతుల వినీత్ ఈ నెల7 నుంచి 14 వరకు ఒడిషాలోని భువనేశ్వర్‌లో జరిగే 73వ ఆల్ ఇండియా హాకీ పోలీస్‌మీట్‌కు ఎంపికయ్యాడు. వినీత్ హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సిటీ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినీత్ ఎంపికపై హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, శంకర్, ఉమామహేశ్వర్, సజ్జు, యూసుఫ్, రమేష్, తిరుపతి హర్షం వ్యక్తం చేశారు.


వినీత్

రాజన్న ఆలయంలో

కొనసాగుతున్న వేడుకలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
- రాజన్న సేవలో పలువురు ప్రముఖులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో స్వామి వారితో పాటుగా శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి అనుబంధ పరివార దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వార్లకు భక్తోత్సవము, హవనములు కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు.

● దర్శించుకున్న ప్రముఖులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు సిద్దిపేట జిల్లా జడ్జి సాయిరమాదేవి, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కే. జ్యోతి వేములవాడకు వచ్చారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అర్చకులు స్వస్తి వేదోక్త స్వాగతం పలికారు. శ్రీరాజరాజేశ్వర స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శ్రీకాంచారి, రాజేందర్ తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

● రాజన్న గోశాల, అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు, అన్నదాన ట్రస్ట్‌కు హైద్రాబాద్ నగరానికి చెందిన మదికంటి సృజన్ - స్వాతి దంపతులు విరాళం ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. రాజన్న ఆలయ గోశాలకు రూ. ఒక లక్ష, అన్నదాన ట్రస్ట్‌కు రూ.1.50 లక్షలు, శ్రీస్వామివారికి రూ.63 వేలు 638 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. వారి వెంట ఆలయ అకౌంటెంట్ ఆగంరావు ఉన్నారు.

వేములవాడలో సందడి

- కల్యాణానికి తరలివచ్చిన భక్తులు


రాజన్న ఆలయం వద్ద ఆటపాటలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి వేములవాడకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి రాజన్న ఆలయానికి భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. రాత్రి 7 గంటల వరకు రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటుగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీసీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి జోగినీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయం ముందు జోగినీలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారియి. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో జడల రమేష్ ఏర్పాటు చేసిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పలు విభాగాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్యాణం ఏర్పాట్లను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.


ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు, జోగినులు

రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజ్వశ్వర స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు వేములవాడ మండలం చింతలఠాణ గ్రామానికి చెందిన నిమిశకవి శ్రీకాంత్ స్రవంతి దంపతులు విరాళం అందజేశారు. శనివారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్న అనంతరం అన్నదాన ట్రస్టుకు రూ. లక్ష, 41 వేయి 116లు ఏఈవో జయకుమారికి అందజేశారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద శనివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతు గౌడ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హోమాలు, చండీయాగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నిత్య పూజలను నిర్వహిస్తామన్నారు. శనివారం చండీయాగాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు మోడెం సురేందర్, బాలసాని స్వామిగౌడ్, వంగ శ్రీనివాస్, పొన్నం అంజయ్య, జనార్ధన్(లడ్డు), కోడూరి రవి, మేరుగు యాదగిరిగౌడ్, అశోక్, సాయిలీల సురేష్, రాయమల్లుగౌడ్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న అర్చకుడు

కొండగట్టులో భక్తుల సందడి


కొండగట్టులో ఆలయం వద్ద భక్తులు


జయంతి కోసం కొండగట్టులో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మల్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా వచ్చిన భక్తులు, దీక్షాపరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

● నేడు శ్రీరామనవమి వేడుకలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడానికి దేవస్థానం తరఫున ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక వేదికపై రాములోరి కల్యాణం వేడుకగా జరుపనున్నారు.

చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

కొండగట్టులో జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సగానికి పైగా పొడగాటి కర్రలతో బారికేడ్లు, క్యూలైన్‌లు ఏర్పాటు చేయగా ఈసారి ఇనుప వాటితో ఆలయం ముందు, వెనుకాల ఏర్పాటు చేశారు. మరిన్నింటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

వైభవంగా కుంకుమ పూజలు

పెగడపల్లి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నామాపూర్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు, ప్రధాన కలశస్థాపన నిర్వహించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నామాపూర్‌లోని రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

బంగారం తరలింపు వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

- మరో ఇద్దరి కోసం గాలింపు
- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీరప్రసాద్

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని మాయం చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉన్న తన సమీప బంధువు రవీందర్ ద్వారా 400 గ్రాముల బంగారాన్ని తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలు పంపించాడు. దీంతో రవీందర్ బంగారం ఇండియాకు పంపించే ప్రయత్నాలలో భాగంగా వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన తౌంటి బీరయ్య, గడ్డం అనిల్ ఇండియా వెళుతున్నారని తెలుసుకొని వీరి ద్వారా 400 గ్రాముల బంగారం పంపించాడు. సౌదీ నుంచి బయలుదేరుతున్న సమయంలో తాము పెద్ద మొత్తంలో బంగారం ఇండియాకు తీసుకువస్తున్న విషయాన్ని తమ సమీప బంధువు ఏనుగుల నాగరాజుకు సమాచారం ఇవ్వడంతో ఈ మొత్తం బంగారాన్ని కాజేయాలని పథకం పన్నారు. హైదరాబాదులోని విమానాశ్రయంలో దిగిన వెంటనే అక్కడకు చేరుకున్న నాగరాజుకు బంగారం ఇవ్వడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని ఏఎస్పీ వివరించారు. సౌదీ నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని రాంప్రసాద్‌కు అప్పగించాల్సిన బీరయ్య, అనిల్ అందుకు బదులుగా నాగరాజుకు అప్పగించిన విషయం తెలుసుకున్న రాంప్రసాద్ తాను మోసపోయినట్లు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సంఘటనలో బీరయ్య, అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, కాల్వ వెంకటేష్, ఏనుగుల నాగరాజు పరారీలో ఉన్నారని ఆమె వివరించారు. పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ఇద్దరు ఎస్ఐలతో కూడిన ఆరుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటుచేసి గాలింపు చేపట్టామని, విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల కన్ను కప్పి పెద్ద మొత్తంలో బంగారం తీసుకువచ్చిన వ్యవహారం వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మిగిలిన నిందితులను పట్టుకుని బంగారం స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బాలుడి వీరంగం

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ బాలుడు వీరంగం సృష్టించాడు. మత్తు పదార్థాలకు అలవాటు పడి శనివారం ఇంట్లో ఉన్న తన సోదరిని చితకబాదగా మందలించిన తల్లిపై బండరాయితో దాడి చేసేందుకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. స్థానికులు ఆ బాలుడిని ఇంట్లో బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకొని 100 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలు


ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) సిక్దర్‌ను అభినందిస్తున్న మాజీ ఉద్యోగులు

జ్యోతినగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలుకు మార్గం సుగమమైంది. గతంలో ఉన్న ఈపీఎస్-95 కింద కనిష్ఠ స్థాయిలో పెన్షన్ పొందిన రిటైర్డ్ ఉద్యోగులు ఇకముందు నిజవేతనాలపై(హయ్యర్ వేజెస్) ఈపీఎస్ 95 స్కీం కింద గరిష్ఠంగా పెన్షన్ పొందనున్నారు. రామగుండం ఎన్టీపీసీ మానవ వనరుల(హెచ్‌ఆర్) విభాగం అధికారులు చొరవతో కొత్త పెన్షన్ పథకానికి మోక్షం లభించింది. హయ్యర్ వేజెస్‌పై పెన్షన్ ఇవ్వాలని ఎన్టీపీసీ మాజీ ఉద్యోగులు న్యాయం పోరాటం చేశారు. గతంలో సుప్రీంకోర్టు నిజవేతనాలపై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీంను రిటైర్డు ఉద్యోగులకు అమలు చేయాలని తీర్పు ఇచ్చింది. 01-09-2014 తరువాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఈ పథకం అమలు చేయాల్సి ఉంటుంది. రామగుండం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు కరీంనగర్‌లోని పీఎఫ్(ఈపీఎఫ్‌వో) అధికారులతో ఈపీఎస్ 95పై సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో సుమారు 398 మంది రిటైర్డు ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీం అమలు కానుంది. మెరుగైన పెన్షన్ అమలయ్యేలా కృషి చేసిన హెచ్‌ఆర్ ఏజీఎం(హెచ్‌వోడీ) విజయ్ కుమార్ సిక్దర్, అధికారులను ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అభినందించారు. హయ్యర్ వేజెస్‌పై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీం అమలుకు కృషి చేసిన ఎన్టీపీసీ మానవ వనరుల అధికారులను రామగుండం ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు ఎ.రాంకిషన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగించనున్నామని, కార్మికులందరూ సన్నద్ధం కావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్యలతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సోమవారం లేబర్ కమిషన్ కార్యాలయంలో సమ్మె తేదీని ప్రకటించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త నియామకాలు లేవన్నారు. ఉద్యోగుల పీఎఫ్ ట్రస్టులో ఉన్న డబ్బులను యాజమాన్యం వాడుకుందన్నారు. దీంతో ఉద్యోగులు పీఎఫ్ డబ్బులు తీసుకునే వీలు లేకుండా పోయిందన్నారు. గత సర్కార్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో విలీనం అంశం ఉందని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని, ఆడబిడ్డలకు అండగా ఆర్టీసీ ఉద్యోగులు ఉంటారని, దానికనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈవీ బస్సులను తీసుకు వచ్చి డిపోలన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేట్ పరం చేశారన్నారు. కేంద్రం ఎలక్ట్రిక్ బస్సులపై ఇస్తున్న సబ్సిడీని ప్రైవేట్ సంస్థలకు కాకుండా ఆర్టీసీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్‌లు లేవని యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సమావేశంలో ఈబీ రావు, అంజిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి థామస్‌రెడ్డి

దళితబంధు నిధులు విడుదల చేయాలని ఆందోళన


కథలాపూర్‌లో సాధన సమితి సభ్యుల నిరసన

కథలాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద ఎంపికైన వారికి రెండో విడత నిధులు విడుదల చేయాలని శనివారం కథలాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సాధన సమితి సభ్యులు ఆందోళన చేశారు. కలెక్టర్ల అకౌంట్లలో దళితబంధు నిధులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎంపిక చేసిన వారికి లబ్ధి చేకూర్చడం లేదని ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాధన సమితి అధ్యక్షుడు తీట్ల శంకర్, తరి రవి, తరి రమేశ్ తదితరులు ఉన్నారు.


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


డీసీసీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మొగిళిపాలెంలో పూల మాల వేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

కరీంనగర్ టౌన్/కరీంనగర్ అర్బన్/సుభాష్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా అధికారులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు శనివారం ఘనంగా నివాళులు అర్పించారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

నగరంలోని మంచిర్యాల చౌరస్తా జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బొలుమల్ల సదానందం, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం, పార్లమెంట్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆగయ్య పాల్గొన్నారు.

● మంచిర్యాల చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి డాక్టర్ అరవింద్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కరుణాకర్ పాల్గొన్నారు.

● బీజేపీపార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి యుగంధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేశారు.

● మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలామాల వేశారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

గంగాధర: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. గంగాధర బ్లాక్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గణేశ్‌నగర్ : విద్యుత్ శాఖ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఎస్ఈ రమేష్ బాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయ కేంద్రం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, రాష్ట్ర డిగ్రీ కళాశాలల సంఘం కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, ప్రాంతీయ సమన్వయ కర్త డాక్టర్ వంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు బీవీ రావు, భూపతిరెడ్డి, కార్గో మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: నగరంలోని రేకుర్తిలో బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

మానకొండూర్/గంగాధర/తిమ్మాపూర్: బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. మానకొండూర్‌లో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలలో ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనించాలని కోరారు. గంగాధరలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాళులర్పించారు. తిమ్మాపూర్ మండలం మొగిళిపాలెంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

హుజూరాబాద్/శంకరపట్నం/సైదాపూర్/జమ్మికుంట/చొప్పదండి/రామడుగు/చిగురుమామిడి/తిమ్మాపూర్/వీణవంక: మండలాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు, బీఆర్ఎస్, సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీ నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కరీంనగర్‌లో పూల మాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నివాళి అర్పిస్తున్న టీఎన్‌జీవోస్ నాయకులు


ఆర్టీసీ బస్టాండ్‌లో నివాళులర్పిస్తున్న ఈడీ సోలమన్

‘ఎల్ఆర్ఎస్’తో రూ. 37.87 కోట్ల ఆదాయం

(5వ పేజీ తరువాయి)

త్వానికి వచ్చింది. వారిలో 1,785 మందికి మాత్రమే ప్రొసీ డింగ్స్‌ను జారీ చేయగా మిగిలిన దరఖాస్తులను పరిశీలన పేరుతో పెండింగ్‌లోనే ఉంచారు.

- శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) పరిధిలోని అర్బన్ ప్రాంతాల్లో 21,236 మంది దరఖాస్తు చేసుకోగా వాటిలో 16,362 దరఖాస్తులకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశమిచ్చారు. వారిలో 3,067 మంది 9.65 కోట్ల రూపాయల ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించారు. వీరికి ప్రొసీడింగ్స్ జారీ చేయాల్సి ఉంది.

జిల్లాలో మొత్తం 42,213 మంది ఎల్ఆర్ఎస్‌కు అర్హులు కాగా ఏప్రిల్ 1వ తేదీ వరకు 9,186 మంది మాత్రమే ఫీజులు చెల్లించారు. 2,457 మంది స్థలాలను క్రమబద్ధీకరిస్తూ ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్‌ను అధికారులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగిస్తూ 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ చేయించుకునేందుకు అవకాశమిచ్చింది. ఎల్ఆర్ఎస్ చేసుకోవాలనుకునే వారికి ఎలాంటి అవాంతరాలు కల్పించకుండా, డాక్యుమెంట్ల షాట్‌ఫాల్, ఎన్‌వోసీల పేరుతో ఇబ్బందులు పెట్టకుండా క్లియర్ చేస్తే 25శాతం రాయితీ చార్జీలతో మరో 25 శాతం మంది పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ తీసుకుంటారని భావిస్తున్నారు.

చింతకుంటలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

భగత్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కర్ర సత్యప్రసన్నరెడ్డి, మడుపు మోహనచారి, బానోతు శ్రావణ్‌నాయక్, స్వామిగౌడ్, కంకణాల అనిల్‌కుమార్, పట్టెం లక్ష్మీనారాయణ, భూపతి శ్రీనివాస్, లావుడియా రంగనాయక్, సుధాకర్, గద్దల సుజాత, కొత్తూరి నిర్మల, గోపాల్, సత్యం, నారాయణ, అజీమ్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి ఎదుర్కోలు వేడుక

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో ఆదివారం నిర్వహించనున్న సీతారామ కల్యాణంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో శనివారం సీతారాముల ఎదుర్కోలు వేడుక నిర్వహించారు.పొన్నం రవిచంద్ర దంపతులు పాల్గొన్నారు.

నగరంలోని 35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి నివాసంలో రాములోరి ఎదుర్కోలు వేడుక నిర్వహించారు.

వైరాగ్యం ప్రభాకర్‌కు సన్మానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన వైరాగ్యం ప్రభాకర్‌ను శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో సన్మానించారు. జైనీ క్రియేషన్స్, జైనీ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభాకర్ జైనీ రాసిన సర్దుకున్నారా కథపై గతంలో తన సమీక్షా వ్యాసం పంపించారు. శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన 'ఒక కథ అరవై ఒకటి సమీక్షలు' అనే కార్యక్రమంలో ఆ వ్యాసాన్ని వినిపించారు.

రామాయణం నిరంతర పారాయణ గ్రంథం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రామాయణం నిరంతర పారాయణ గ్రంథమని సాహితీవేత్త, అవధాని గండ్ర లక్ష్మణరావు అన్నారు. శనివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో రుద్రమ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మొల్ల రామాయణంపై ప్రసంగించారు. మొల్ల రాసిన రామాయణం సామాన్యులకు సైతం అనుకూలంగా ఉందన్నారు. విశ్రాంత ఉపన్యాసకుడు గజేందర్‌రెడ్డి, రాజేశ్వరి, గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తమ కుమారుడిని హత్యచేసిన ఎడల్లి సతీష్, కాల్వ సతీష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని బొమ్మకల్ గ్రామానికి చెందిన బాధితులు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల చౌరస్తాలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో ఫ్లెక్సీ ప్రదర్శించి అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.

మెహర్‌నగర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని 40వ డివిజన్ మెహర్‌నగర్‌లో రెడ్డి సంఘం అధ్యక్షుడిగా కర్ర భాస్కర్‌రెడ్డి ఎన్నికైట్లు ఎన్నికల నిర్వహణ అధికారి జంగా శ్రీరాంరెడ్డి, నోముల రాంరెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కంకణాల వెంకటరాజారెడ్డి, పెండ్యాల శశిధర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా కొమ్మెర శ్రీమాన్‌రెడ్డి, ట్రెజరర్‌గా కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కమలాకర్‌రెడ్డి, ఆర్గనైజ్ సెక్రటరీగా రాహుల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా సూదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే

భగత్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. నగరంలోని రేకుర్తిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆరేవోయిర్ 2025 పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో రాణించాలంటే విషయ, నైపుణ్య పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో సంబరాలు

గణేశ్‌నగర్,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యసభ, లోక్‌సభలో ఆమోదం పొందడంపై శనివారం బీజేపీ మైనార్టీ మోర్చా కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు కిరణ్ రీజీజు, బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ మాట్లాడుతూ ఎంతోకాలంగా చూస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం శుభ పరిణామన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ముస్లింలకు న్యాయం జరిగిందన్నారు. దేశంలో వక్ఫ్ ఆస్తులను 25 నుంచి 30 వేల ముస్లిం కుటుంబాలు మాత్రమే అనుభవిస్తున్నట్లు ఆరోపించారు. బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్, రాష్ట్ర కార్యదర్శి బల్ బీర్ సింగ్, మైనార్టీ మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జి బషీరుద్దీన్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 13న హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై మిలియన్ మార్చ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సవరణ పేరుతో వక్ఫ్‌బోర్డు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నిహాల్ అహ్మద్, లయాక్ ఖాద్రి, అబ్దుల్ రెహమాన్, ఖలీమొద్దీన్, మహమ్మద్ అమీర్, మహమ్మద్ చాంద్, మహమ్మద్ పాషా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సుభాష్‌నగర్ :నగరంలోని శ్రీసాయి లైఫ్‌లైన్ హాస్పిటల్ చైర్మన్ ప్రముఖ సర్జన్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ అప్రెసియేషన్ అవార్డు అందుకున్నారు.

కరీంనగర్ రూరల్: నగునూరులోని ఎస్‌పీఆర్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం కరాటే బెల్టులు ప్రదానం చేశారు.సీఐ శ్రీలత, అడ్వకేట్ హేమలత, పాఠశాల చైర్మన్ డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.యాకయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: ఇస్కాన్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలోని రాధా గోవిందుల బాలాలయంలో శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహంలో నిర్వహించిన భక్తి గీతాలాపన, రామాయణ పాత్రల వేషధారణ, నృత్య పోటీల్లో చిన్నారులు ప్రతిభచాటారు.

● సప్తగిరి కాలని కోదండ రామాలయంలో రామాయణంపై ప్రవచనం చేస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయరుస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం ఉదయం శ్రీరామ పాదుకారాధన నిర్వహించారు.

● జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ ఫంక్షన్ హాల్లో ఈద్ మిలాప్ నిర్వహించారు.

భగత్‌నగర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన, సన్‌రైజ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ సర్కిల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

సుభాష్‌నగర్ : మేముసైతం యువసేన ఫౌండేషన్, ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శనివారం కూలీల పిల్లలకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యురాలు ఎలగందుల హన్సిక పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఫౌండేషన్, మహాసభ అధ్యక్షరాలు చకిలం స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్‌లోని బొమ్మకల్ మాజీ సర్పంచ్ వెంగల్‌దాస్ నారాయణ అనారోగ్యానికి గురై చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రక్తం అత్యవసరమవడంతో అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గాలిపెల్లి కుమార్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ 54వ సారి రక్తదానం చేసినట్లు చెప్పారు.

● జిల్లా కేంద్రంలోని గాయత్రీ నగర్ కపిల్ బాలకుటీర్‌లో ఉంటూ సరస్వతి శిశు మందిర్‌లో చదువుతున్న విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కథల పుస్తకాలను అందజేశారు.

జమ్మికుంట రూరల్: మల్టీపర్పస్ వర్కర్ పైడిపల్లి సమ్మయ్య తల్లి ఇటీవల మరణించగా తనుగుల పంచాయతీ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కొప్పుల శంకర్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

రామడుగు: దళిత ఎమ్మెల్యేల పనితీరులో పీపుల్స్ పల్స్ సర్వేలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలవడంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరీష్ హర్షం వ్యక్తంచేశారు.

గంగాధర: మండలంలోని నర్సింహులపల్లి కొత్త ఇళ్ల వద్ద నీటి ఎద్దడి సమస్యను ఎమ్మెల్యే సత్యం దృష్టికి తీసుకెళ్లినట్లు, రెండు రోజుల్లోనే బోరు వేయిస్తానని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ తోట మల్లారెడ్డి తెలిపారు.

మానకొండూర్: లక్ష కిలోమీటర్ల రథయాత్ర, పదివేల కిలోమీటర్ల పాదయాత్ర పోస్టర్‌ను మానకొండూర్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆవిష్కరించారు.

హుజూరాబాద్: పట్టణంలోని 13వవార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ప్రణవ్ ఎస్‌డీఎఫ్ నుంచి రూ.5లక్షల నిధులు మంజూరు చేయగా శనివారం పనులు ప్రారంభించారు.

శంకరపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం కూడలి వద్ద బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువ జన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవి శనివారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

వారసంతల్లో కనీస వసతులు కరువు

రామడుగు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న వారసంతల్లో కనీస వసతులు కరువవడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రామడుగు మండల కేంద్రంలో మంగళవారం వారసంత నిర్వహిస్తుండగా గోపాల్‌రావు పేటలో శుక్రవారం సంత నిర్వహిస్తున్నారు. దీంతోపాటు వెదిరలో కూడా వారసంత నిర్వహిస్తారు. ప్రధానంగా రామడుగు, గోపాల్‌రావుపేట గ్రామాల్లో ప్రధానరహదారిపై సంత నిర్వహిస్తుండగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే చిరువ్యాపారులకు మరుగుదొడ్లు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. సంతప్రాంతాల్లోగాని, బస్టాండ్‌లోగాని సామూహిక మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళావ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానరహదారిలో వార సంత నిర్వహిస్తుండగా అటుప్రజలకు, వ్యాపారులకు బాగానే ఉన్నప్పటికీ వివిధప్రాంతాల నుంచి వస్తున్న చిరు వ్యాపారులు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయాగ్రామాల్లో వారసంతల అభివృద్ధి చెందాలంటే వెంటనే మరుగుదొడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.


గోపాల్‌రావుపేటలో రహదారిపై నిర్వహిస్తున్న వారసంత



సైదాపూర్: రాయికల్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాలుగోరోజు కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/సైదాపూర్/జమ్మికుంట/మానకొండూర్/చిగురుమామిడి/వీణవంక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలాల్లోని గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నాల్గో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ దేశంలో రాజ్యాంగ ఉల్లంఘన చేస్తోందని ప్రజలకు వివరించారు. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిరంకుశ ధోరణికి పాల్పడుతున్నారని అన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి నిరంకుశపాలన చేద్దామని చూస్తోందని మండిపడ్డారు. పాదయాత్రల్లో కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హుజూరాబాద్: కాట్రపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తులు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి

ఇల్లందకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంటలో ఆదివారం జరిగే సీతారామ కల్యాణానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఒకప్రకటనలో పేర్కొన్నారు. కల్యాణానికి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారని, ట్రాఫిక్ నిబంధనలుపాటిస్తూ దర్శనానికి వెళ్లాలనితెలిపారు. నిబంధనలు పాటిస్తే శ్రీరామనవమి పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవచ్చని కోరారు.

ఆలయాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

● ఇల్లందకుంట ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు


ఇంగిలే రామారావు

ఇల్లందకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆలయచైర్మన్ ఇంగిలే రామారావు అన్నారు. దేవాలయకమిటీచైర్మన్‌గా ఇంగిలే రామారావుతోపాటు కమిటీసభ్యులు శనివారం కొలువుదీరారు. ఈసందర్భంగా ఎన్నికైన చైర్మన్ రామారావుతోపాటు కమిటీసభ్యులను శేష వస్త్రాలతో సత్కరించారు. అనంతరం చైర్మన్ రామారావు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ సహకరించి, విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు.

సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

హుజూరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాలయంలో ఆదివారం జరిగే సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో చలువపందిళ్లు, మంచి నీరు, విద్యుత్‌సౌకర్యంఏర్పాటు చేశారు. రామాలయాన్ని విద్యుత్‌దీపాలతో అలం కరించారు. మహాఅన్నదానం చేయనున్నట్లు ఆలయ చైర్మన్ క్యాస చక్రధర్ తెలిపారు.


రామాలయంలో చలువ పదిళ్లు వేస్తున్న సిబ్బంది

దుర్వాసన.. బూడిద రేణువులు

● ప్రమాదకరంగా రైసు మిల్లులు
● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మానకొండూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ సమీపంలోని రైసు మిల్లులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. 40ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండల కేంద్రంలో సుమారు 50కి పైగా రైసుమిల్లులు ఉండగా ప్రతినిత్యం వాటినుంచి వెలువడే మురుగు నీరును కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారికి ఇరువైపులా వదిలి వేస్తున్నారు. ఆ మురికి నీరంతా రోడ్డు వెంబడి ప్రవహించడంతో బస్సుల్లో ప్రయాణించేవారు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. రైస్ మిల్లు గొట్టాల నుంచి వెలువడే పొగలో కాలిన బూడిద రేణువులు ప్రయాణికుల కళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. మురికి నీరంత మానకొండూర్ పెద్ద చెరువు మత్తడి ఒర్రె నుంచి సమీప పొలాల్లోకి వెళ్తుండడంతో పంట దిగుబడులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రైసుమిల్లుల నుంచి వెలువడుతున్న మురుగునీరు

బంగారం బహూకరణ


ఈవోకు బంగారం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఇల్లందకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామికి ధర్మారం సింగిల్‌విండో చైర్మన్ కటంగూరి శ్రీకాంత్‌రెడ్డి-నిహారిక దంపతులు రూ.25 వేల విలువైన 3 గ్రాముల (పావుతులం) బంగారు పుస్తెలను ఈవో కందుల సుధాకర్‌కు శనివారం అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా బంగారు పుస్తెలను అందజేసినట్లు వారు తెలిపారు.